# బామ్మగారి కథ

స్వామి చిత్రానంద



**"ఇంద కాఫీ తాగు"**

**"అప్పుడేపెట్టేశావ్? గుడ్. నువ్విక్కడే ఉండిపోరా."**

**"ఉండిపోతాగాని - నీ బాబు నాక్కూడా నెలనెలా జీతం సరిగా పంపుతాడా?"**

"నేనే ఏదో రాస్తా. ఆఫీజా, ఈఫీజా, స్పెషల్ ఫీజా అంటూ అంతగా వస్తే, ప్రోనోట్లూ, సంతకాలూ, శేర్లూ ఉండనే ఉన్నారు."

"థాంక్స్ రా "

"....."

"ఆమె గారెవ్వర్రా? రోజూ ఉదయం ఏడు గంటలకి ఇట్నుంచి అటు వెళ్తుంది. సాయంత్రం ఆరు గంటలకి అట్నించి ఇటు వస్తుంది? వారం రోజుల్నించి చూస్తున్నాను."

"నీలాగ వయసు మళ్లిన వాళ్లని చూడను."

"చూడరా. రూపాయంత బొట్టు, ఆ వర్చస్సూ, తలనిండా మల్లెపూలు చూడు. ఆ మహాతల్లి మొహం చూస్తే నీ పాపాలన్నీ పోతాయి."

"పోతే ఏం లాభం? మళ్లీ చేస్తుంటాంగా?"


"అందుకే రోజూ చూడమంటున్నా. ఆ మొహంలో మహాలక్ష్మి కళ ఉట్టిపడుతోంది - ఆమె ఎవరోగాని -"

"తెలియదని చెప్పాను గదరా. ఉదయం తొమ్మిదీ పదికి ఇట్నించి సన్నీలో ఓ జీన్స్ రాణి వెళ్తుంది. ఆమె క్వీన్ మేరీస్ కాలేజీలో బీఏ ఫస్టియర్. ఇంకోటి తొమ్మిదిన్నరకి ఇటు వెళ్తుంది కెనెటిక్ హోండాలో. ఆమె యతిరాజ్ కాలేజి బి.కాం. ఇంకోటుంది - లంగా, ఓణీ, లేడీస్ సైకిల్ - శారదా విద్యాలయలో ప్లస్ టూ -"

"పరవాలేదే. కాని, ఆ అమ్మాయిల గురించి తెల్సుకున్నావు. బాగానే ఉంది. ఆ అమ్మాయిలకి, అన్నలుగాని, మేనమామలు గాని, పినతండ్రులు గాని లేకుండా చూసుకో."

"చూద్దం వరకేరా. హద్దు మీరను."

"నేత్రానంద స్వాములన్న మాట?"




"సరే... వంట ఏం చేస్తున్నావ్?"

"ఇంకా ఏం అనుకోలేదు. అత్తెసరు వేశాను. రాత్రి పాలు తోడుకోలేదు. బయటకెళ్లి పెరుగు తేవాలి. వస్తూ వస్తూ ఏ బంగాళా దుంపలో తెస్తాను. వేయించేస్తాను. ఊరగాయలున్నాయి. చారు పెడతా, చాలుగా?"

"చాలు చాలు. నేనివాళ కాలేజీకి వెళ్లాలి."

"ఏ కాలేజీకి?"

"ఉమెన్స్ కాలేజికి."

"గుడ్ లక్... కొస్త ఆ అమ్మాయిలకి తోడబుట్టిన వాళ్లు లేకుండా ఉంటే బెటర్.. ఎందుకేనా మంచిది. జాన్సన్ ప్లాస్టర్లు అన్ని సైజులవీ జేబులో పెట్టుకో. సేఫ్టీకి."

★ ★ ★

"బామ్మగారూ నమస్కారం!"

"చిరంజీవ! ఎవరు బాబూ నువ్వు?"

"మాది గోపాలపురమండి."

"ఏ గోపాలపురం?"

"రావులపాలెం దగ్గిర".

"మరి ఇహనేం? చెప్పు చెప్పు. ఎవరి తాలూకు?"

"తణుకు సీతారామయ్యగారి మనవణ్నండి.'

"కొడుకు కొడుకువా? కూతురు కొడుకువా?'

"కొడుకు కొడుకునే నండి"

"ఏవిటీ?... సుబ్బారావు కొడుకువా?"

"అవునండి."

"చెప్పావు కాదు. ఎంతమంది అన్నదమ్ములు?"

"నే నొక్కడినే నండి."

"నేనెప్పుడో చిన్నప్పుడు చూశాను సుబ్బారావుని. ఏం చేస్తున్నావిక్కడ?"

"వంట... వంట చేస్తున్నానండి."

"వంటా?"

"అదేనండి." 'నలభీమపాకం' రచన భీమేశ్వర రావు' అని పుస్తకం రాయాలనండి."

"అదేం పనయ్యా? సుబ్బరంగా ఏ గవర్నమెంటు ఆఫీసులోనో గుమాస్తాగా కుదరక?'

"కుదరదండి. మనలాంటి వాళ్లకి అలాంటి ఉద్యోగాలు దొరకవండి."

"అదేవిటి అలా అంటావ్?"

"అవన్నీ అంతేనండి. పైకి అన్నీ అలా కనబడతాయి గానండి. చేతికి అంది రావండి."

"అదే పోయిందిలే. ఏదో నీ కాళ్ల మీద నువ్వు నిలబడగలిగితే అంతే చాలు. మీ మేనత్త ఒహత్తి ఉండేది సీతాలక్ష్మి అని. నాతో ఆడుకునేది. ఎక్కడుంది?"

"అమెరికాలో ఉందండి."

"అమెరికాయే?"

"అవునండి."

"అక్కడేం బాగుండదట! మనకి పగలయితే వాళ్లకి రాత్రట! అన్నీ బోలెడేసి ధరలట!"

"అవునండి. మరి పిల్లలంతా అక్కడే ఉన్నారు గదండీ?"

"పోనీలే. పిల్లల దగ్గరుంటోంది చాలు..."

"...."

"మరి నే వస్తా. ఇది మా రెండోవాడి ఇల్లు"

"మళ్లీ రేపు సాయంత్రం కలుస్తానండి."

"ఎంతమాట! అలాగే, దానికేం భాగ్యం?"

★ ★ ★

"బామ్మగారూ! మీరు కొస్త మీ గురించి చెబుతారా?"

"దానికేం భాగ్యం? అయినా ఇదేవన్నా, రామాయణమా? భారతమా?"

"అది కాదండి. మిమ్మల్ని చూస్తే మీ గురించి అడగాలనిపించిందండి."

"అయితే చెప్తా విను. నాకు ఇద్దరు మగపిల్లలు. ఇద్దరు ఆడపిల్లలు. 'ఆడపిల్లలిద్దరికీ పెళ్లిళ్లయి అత్తారిళ్లకు వెళ్లారు. ఒకరు హైద్రాబాదు. ఒకరు విశాఖపట్నం. ఇద్దరు మగపిల్లలూ ఇక్కడ ఉంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. కోడళ్లు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు."

"కోడళ్లు కూడా చేస్తున్నారా?"

"చెయ్యకపోతే ఎలా? ఒక్క జీతంతో సంసారం గడవడం చాలా కష్టం. రెండు జీతాలుండాలి. ఒకోనెల ఆ రెండు జీతాలూ చాలవు. అందుకని కొందరు-"

"అవునండి. ఉన్నారండి. అలాంటి వాళ్లున్నారండి."

"మా పిల్లలు అలాంటివాళ్లు కారు. పెద్దాడు కాలేజీ లెక్చరరు. కోడలు స్కూలు టీచరు. వాళ్లు మూడు గదుల వాటా తీసుకుని ఉంటున్నారు. ఆ వీధిలో."

"వాళ్లకి పిల్లలున్నారాండీ?"

"ఓ ఆడపిల్ల. అయిదో క్లాసు చదువుతోంది. నేను మాత్రం వాళ్ల దగ్గిరే ఉంటాను."

"అదేవిటండీ? తాతగారు?"

"ఆ సంగతి తరవాత చెబుతా. నేను పెద్దాడి దగ్గిర ఉండడానికి కారణం వాళ్ల కూతురు 3 గంటలకి స్కూలు నుంచి వచ్చేస్తుంది. దానికి అన్నం పెట్టి, హోం వర్కు అదీ చేయించాలిగా?'

"మరి, మీ కోడలు?"

"అదెప్పుడో ఆరు గంటలకి వాళ్ల ఆయనతో కలిసి వస్తుంది. అంత వరకూ నేనూ, నా మనవరాలే ఇంట్లో"

"మరి తాతగారు ఎక్కడుంటారు?"

"ఇక్కడే. ఇది మా రెండో వాడి ఇల్లు."

"వస్తానండి. మళ్లీ రేపు కలుస్తానండి."

★ ★ ★

"పెద్దాడి సంగతి చెప్పాను గదూ?"

"అవునండి."

"రెండోవాడికి బ్యాంకిలో పని. పిల్లల్లేరు. కోడలుక్కూడా బ్యాంకిలోనే పని. వాళ్లదో ప్రత్యేకమైన ఇల్లు. విశాలంగా ఉంటుంది. మీ తాతగారికి నూతినీళ్ల స్నానం అంటే ఇష్టం. పూజ, మడీ, దడీ అన్నీ ఉన్నాయి. ఈ ఇల్లు ఆయనకి వసతిగా ఉంటుంది."

"మరి, ఆ ఇల్లు అంత పెద్దదైతే, మీరు కూడా తాత గారితో పాటు అక్కడే ఉండొచ్చు గదండీ?"

"దానికి ఆ కోడలు ఒప్పుకోలేదు. 'ఇద్దరికీ మేం పెట్టలేం. ఇంకో కొడుకు ఉన్నాడుగా. ఒకరు అక్కడా, ఒకరు ఇక్కడా ఉండాలి' అంది. సర్లే ఎక్కడయితేనేం వాడూ కొడుకే గదా! పైగా అక్కడ ఓ మనవరాలు ఉంది. అంచేత నేను అక్కడ మీ తాతగారు ఇక్కడ."

"బామ్మగారూ! ఆ సంచీలో ఏవిటండీ?"

"అవి మీ తాతగారు రాత్రి కట్టుకున్న పంచె, బనీను. శుభ్రంగా ఉతికి ఆరేసి తెస్తుంటాను. రాత్రి మళ్లీ స్నానం చేసి, ఇవి కట్టుకుంటారు. ఆయన రెండు పూట్లా స్నానం చెయ్యాల్సిందే. చన్నీళ్లే చేస్తారు. ఎంత శీతకాలమైనా సరే-"

"బామ్మగారూ! తాతగారిని చూడాలనుందండి."

"దానికేం భాగ్యం నాయనా! రా! చూద్దువుగాని."

"....."

"ఇటురా. అది వాళ్ల గుమ్మం. ఇది మా గుమ్మం."

"....."

"ఈ పందిరి మంచం చూశావా? తణుకులో చేయించారు మీ తాతగారు. ఇప్పుడు అలాంటి పనివాళ్లు లేరు. ఉండి చేసినా, వేసుకుందుకు అంత విశాలమైన గదులూ లేవు. ఆ గుమ్మంలోంచి చూడు. నుయ్యి. శుభ్రమైన నీళ్లు, గంగాబొండం నీళ్లలా ఉంటాయి."

## బాలీవుడ్ బాణీ



ఒకప్పుడు, అంటే అస్సలు చిత్రాలు లేనేలేనప్పుడు సోమీ అలీ పంచతారల హోటల్లోనే విలాసంగా గడిపేది. ఇటీవల కావలసిన సరుకులూ, గట్రా కొంటూ బొంబాయి నగర వీథుల్లో కనబడుతూందిట. కొంపదీసి నౌకర్లెవరూ లేరేంటి చెప్మా? అది కాదుట. మరి? ఒకవేళ సల్మాన్‌ఖాన్ కనుక తనను పెళ్లాడే నిర్ణయం తీసుకుంటే, తను ఓ చక్కని గృహిణి అవుతుందని నిరూపించే ప్రయత్నమట! వారెవా సినీలోకం!

మసూద్.అన్సారి

"తాత గారేరి?"

"అరుగో, చూడు. ఆ ఠీవి. ఆ మీసాలూ. ఆ దర్జా. ఆయనకే చెల్లు. ఆ జరీ అంచు పంచె, కండువాతో ఆ కుర్చీలో కూచుంటే రాజఠీవి ఉట్టిపట్టంలేదూ? ఆ ఫొటో ఆయనదే!"

"మరి ఆ దండ వేలాడ దీశారు?"

"ఆయనకి మల్లెపువ్వులంటే ఇష్టం. అందుకని ఆ దండ ఎప్పుడూ అలాగే ఉంటుంది. అది తియ్యడానికి ఒప్పుకోరు. కూచో. అలా ఆ కుర్చీలో కూచో. ఆయనొచ్చేస్తారు. ఈలోగా నేను పక్క దులుపుతా. ఆయనకి పక్క నలగడానికి వీల్లేదు. దుప్పటీ కూడా తెల్లగా మల్లె పువ్వులా ఉండాలి'

"....."

"ఏవండీ!"

"....."

"మిమ్మల్నే"

"నన్ను పిలిచారా?"

"అవునండి. నేను ఆమెగారి కోడల్ని-"

"మాది గోపాల పురవండి. మా తాతగారు బామ్మగారికి తెలుసండి. మా మేనత్తా, ఈవిడా చిన్నప్పుడు ఆడుకున్నారట!"

"అలాగా?"

"మీ మావగారు?"

"ఆయన పోయి పదిహేనేళ్లయింది. ఆమె ఊహలో ఆయన గారు ఇంకా బతికి ఉన్నాడనే అనుకుంటోంది."

"......."

"సాయంత్రం ఇక్కడికి వస్తుందా. రాత్రంతా తాను భర్తతో ఇక్కడే ఉంటున్నాననుకుంటుంది. అనుకోనీండి. ఏవిటి నష్టం? ఎవరి పిచ్చి వారికానందం!"

"......."

(శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'కలుపు మొక్కలు" చదివినప్పట్నించి అదే విధంగా, సంభాషణల్లో కథను చెప్పాలని తాపత్రయంతో ఇది రాశాను. నేను కృతకృత్యుడనయితే అది వారి ప్రభావమేగాని నా ప్రతిభ కాదు. కాలేకపోతే, అది నా చేతకానితనం - రచయిత)

